## స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాల పరిశీలన



యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంఈవో మనోహర్

**కేశంపేట,మే 30,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను కుట్టే బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎంఈవో మనోహర్ తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మండల పరిధిలోని కొత్తపేట, సంగెం గ్రామాలలో మహిళ శక్తి కుట్టు కేంద్రాలను ఆయన పరిశీలించారు. నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా సరైన పద్ధతిలో విద్యార్థుల యూనిఫాంలను కుట్టాలని ఆయన కుట్టు కేంద్రాల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మండల ఏపిఎం భగవంతు సిసీలు మల్లేష్ యాదయ్య పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## శ్రీవిష్ణు, శివాలయాల్లో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

**శామీర్‌పేట, మే 30, ప్రభాతవార్త** ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు,శ్రీశివాలయ దేవస్థానం ఆలయంలో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు 38వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ దేవాలయ ఉత్సవ కమిటీ వారు పేరన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు, శ్రీశివాలయ దేవస్థానం ఆలయంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. అయితే ఈ నెల 31న శుక్రవారం గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్వామి వార్ల అలంకరణలు, పలు పూజా కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ ఆలయంలో జూన్ 1న ఉదయం 11.11గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి, అదే విధంగ శ్రీభవాని రామలింగేశ్వరస్వామి వారిల కల్యాణోత్సవంను జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్ర దివ్య రథోత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. 2న ఏకాదశి రోజున పూజా కార్యక్రమాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమం మహాదాశీర్వచనం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని, శ్రీస్వామి వార్ల దివ్య కల్యాణోత్సవంలను భక్తులు పాల్గొని తిలకించాలని ఉత్సవ కమిటీ వారు కోరారు.



## ఔటర్ రింగ్‌రోడ్డులోపలి గ్రామాలకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, మే 30, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ మండలంలోని కాచవాని సింగారం, కొర్రెముల పరిధిలోని పలు కాలనీలకు మిషన్ భగీరథ మంచినీటి సరఫరా చేయాలని కోరుతూ ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి నగర వాటర్‌వర్క్స్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరక్టర్ సుదర్శన్ రెడ్డికు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కాచవాని సింగారంలోని దివ్యానగర్, కొర్రెముల పరిధిలోని సుప్రభాత్ టౌన్ ఫేస్ 1,2,3 కాలనీవాసులకు మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. అక్కడి కాలనీలో దాదాపు 350కి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు గ్రామాల ప్రజలకు పూర్తిగా మంచినీటి సౌకర్యం లేదని ఇకనైనా తాగునీటి సౌకర్యం కల్పిం చాలని కోరుతూ హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరక్టర్ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

# జిహెచ్‌ఎంసిలో ఒఆర్ఆర్ మున్సిపాలిటీల విలీనం?

### త్వరలో మహేశ్వరం మున్సిపాలిటీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మే 30 ప్రభాతవార్త :** శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీలను జీహెచ్ఎంసిలో కలిపేందుకు చకచక ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. గత ప్రభుత్వం కూడా గత 5 సంవత్సరాల క్రితమే కొన్ని మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ లో కలపడం జరిగింది. ప్రస్తుతం కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా శివారు మున్సిపాలిటీలు జీహెచ్ఎంసిలో కలుపుతూ త్వరలో ప్రకటన చేయనున్నట్లు ప్రచారం కొనసాగుతుంది. శివారు మున్సిపాలిటీలైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్ జిల్లా,రంగారెడ్డి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ ప్రణాళికను సిద్దం చేసింది.రంగారెడ్డి జిల్లా పరిదిలోని ఇబ్రహింపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల, మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి, రాజేంద్రనగర్ పరిధిలోని శంషాబాద్ మున్సిపాలిటీ, నార్సింగ్ మున్సిపాలిటీలతో పాటు, మేడ్చల్ పరిధిలోని మరికొన్ని మున్సిపాలిటీలను అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మున్సి పాలిటీలను విలీనం చేయనుంది. జీహెచ్ఎంసీ పరిధిని పెంచనుండడంతో ఆయా మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి సంక్షేమం కోసం అత్యధిక నిధులను కూడా విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలోకి రానుండడంతో స్థానికంగా నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి పనులకు కూడా జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్) సంస్థ పరిదిలోకి రానుండడంతో మున్సిపాలిటీలకు ఎన్నికలు దాదాపుగా నిలిపితవేసి గ్రేటర్ హైదరాబాద్‌తో పాటే ఈ ప్రాంతాల్లో కూడా ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని అధికార వర్గాల ద్వారా ప్రచారం.



మహేశ్వరం మున్సిపాలిటీ కార్యాలయం

### త్వరలో మహేశ్వరం మున్సిపాలిటీ

మహేశ్వరంతో పాటు ఓఆర్ఆర్ వెలుపల ఉన్న మండలాలను మున్సిపాలిటీలుగా ప్రకటించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నంటువంటి షాద్‌నగర్, కొత్తూర్,శంషాబాద్,తుక్కుగూడ, ఇబ్రహింపట్నం అన్ని మున్సిపాలిటీలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇక ఓఆర్ఆర్‌కు దగ్గరలో ఉన్న 1978లో పాత తాలుకా కేంద్రాల్లో ఒకటైన మహేశ్వరంను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి రాష్ట్రం ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించింది. మహేశ్వరం నియోజకవర్గం కేంద్రానికి మున్సిపాలిటీగా చేయడానికి మాజీ శాసన సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నాయకులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కూడా అంకుటిత దీక్షతో మున్సిపాలిటీని చేయడానికి చకచక పావులు కలుపుతున్నారు. ఒక పదేళ్ల క్రితమే మున్సిపాలిటీగా కావాల్సిన మహేశ్వరంను ఇంతకాలం తొత్తుపెట్టడానికి కొంతమంది రాజకీయకుల స్వార్థమేనన్న అభిప్రాయంతో పాటు పలు విమర్శలు, ఫిర్యాదులు కూడా లక్ష్మారెడ్డి దృష్టినికి కొంతమంది సీనియర్ నాయకులు ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీ పరిధిలోకి రావడంతో పాటు శివారు ఓఆర్ఆర్ వెలుపల ఉన్న టువంటి మండలాలను కూడా మున్సిపాలిటీలను చేయడానికి ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యానే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

# సంత్ సేవాలాల్ ఆలయంలో మంత్రి సీతక్క పూజలు



సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు చేసి మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీతక్క,పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, మే 30, ప్రభాతవార్త**

దేవరయాంజాల్ గ్రామ పరిధిలోని మల్లన్న కాలనీ సమీపంలో ఉన్న గిరిజనుల నివాసాల వద్ద ఉన్న సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సందర్శించి పూజలు చేశారు. బుధవారం రాత్రి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామ పరిధిలోని మల్లన్న కాలనీ సమీపంలోని గిరిజనుల నివాసాల వద్ద నిర్మించిన సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని మంత్రి సీతక్క సందర్శించి పూజలు చేపి ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగ మంత్రి సీతక్క మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా పనిచేసిన సంత్ సేవాలాల్ మహారాజును ఆదర్శంగ తీసుకుని ప్రజలు ముందుకు వెళ్లాలని సూచించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజానికి ఎన్నో గొప్ప సేవలు చేసి సంఘ సంస్కర్తగ, ఆదర్శ సేవకునిగా నిలిచారని ఆమె కొనియాడారు. మహారాజ్ పరమపదించి సుమారు 200సంవత్సరాలు కావస్తున్నా ఆయనను గిరిజనులు దైవంగ భావిస్తున్నారని అన్నారు. ఆయన చేసిన బోధనలు, అనుసరించిన విధానం అందరికి మార్గదర్శకంగ నిలిచిందన్నారు. సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగ నిర్వహించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ గిరిజన బస్తీలో కనీస సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా సరిగ్గా లేక పేదలు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కనీస సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తానని వారికి మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. గిరిజనులు నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఈ స్థలం భూమి ఎండోమెంట్ భూ సమస్య ఉందని పరిష్కరించటానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల బస్తీ స్థానిక నాయకులు పూల్‌సింగ్ రాథోడ్, పలువురు నాయకులు, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

## వినోదాల బొమ్మాళి..!

### తల్లిదండ్రులు తస్మాత్‌జాగ్రత్త.. మొబైల్స్ నుంచి పిల్లల్ని రక్షించండి

### హెచ్చరిస్తున్న మేధావులు మానసిక నిపుణులు

**నందిగామ,మే 30,ప్రభాతవార్త:** కాలంతో పోటీ పడుతున్న నేటి ఆధునిక యుగంలో మొబైల్ ఫోన్లు చిన్నారులపాలిట శాపంగా మారి వారి బంగారు భవి ష్యత్తును పెడతోవ పట్టిస్తున్నాయి. పిల్లలు తినకుం డా ఏడ్చినా మారం చేసినా పాయంత్రం అయితే చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించేవారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అలాంటి ఏమీ లేవు. తినమన్నా చదవమన్న సెల్‌ఫోన్ చేతికి ఇస్తేనే .. లేదంటే మారం చేస్తూ ఏడుస్తారు. సమయం సందర్భంగా రాత్రి పగలు తేడా లేకుండా సెల్‌ఫోన్‌కు అలవాటు పడుతున్నారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో సెల్ ఫోన్ వల్ల లాభాలు దేవుడెరుగు గాని దానికి అలవాటు పడి జీవితాలు చేజేతులా నాశనం కొనితెచ్చు కుంటున్నారని మేధావులు మానసిక నిపుణులు బహ టంగా చెవుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో పట్టణాల్లో నిరక్షరా స్యులైన తల్లిదండ్రులు తమ కొడుకు కుమార్తె బాగా చదివి ఉన్నతులుగా ఎదుగు తారనే ఆశతో తమ పిల్లలకు వేల రూపాయలు వెచ్చించి స్మార్ట్ ఫోన్లు ఐఫోన్‌లు కొనిస్తున్నారు. కొందరు తమ స్మార్ట్ ఫోన్లను చదు వులకు మాత్రమే ఉనపయోగించగా మరికొందరు కాలక్షేపానికి పిచ్చిపిచ్చిగేములకు అలవాటు పడి మానసిక రోగులుగా మారుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రుల పర్యవేక్షణ పాఠశాలలో ఉపాధ్యాయుల పర్య వేక్షణలోపించి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మా రుతుంది. అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. అనర్థాలు జరగక ముందే పిల్లల కోసం తల్లిదండ్రులు అలర్ట్ కావాల్సింది ఎంతైనా ఉంది.

## డిఎంఅండ్‌హెచ్‌ఓలో సమావేశ మందిరం ప్రారంభం



కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య,పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి

### మేడ్చల్ అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 30, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా ఆరోగ్య,వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాల, సమీక్షా సమావేశాల నిర్వాహణకు సంబంధించి సమావేశ మందిరాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య ప్రారంభిం చారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ఆయన ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య మాట్లాడుతూ వయోజనుల బిసిజి టీకాపై జిల్లా స్థాయి క్యాస్కేడ్ శిక్షణకు హాజరైన వైద్య అధికారులను, పారామెడికల్ సిబ్బందిని తమ విధులు శ్రద్ధగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగ క్షయవ్యాధిని నిర్మూలించటం దాని యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాధస్వామి, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఉచితంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఆరోగ్యసేవలు

### మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 30, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా పరిధిలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచితంగ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు ప్రారంభమైనట్లు మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి తెలిపారు. గురువారం మేడ్చల్ జిల్లా పరిధిలోని ఉప్పల్ పిహెచ్‌సిలో అల్ట్రాసౌండ్ స్కానర్‌ను ప్రజలకు ఉచితంగ సేవలు అందించటానికి ప్రారంభించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధార పడి ఉన్న రోగులకు ఉచితంగ వైద్య సేవలు అందించటానికి, గర్భిణీలకు అల్ట్రాసౌండ్ స్కానర్ సేవలు అందిం చాలనే లక్ష్యంతో ఈ పిహెచ్‌సిలో స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేశామ న్నారు. ప్రతి బుధ, శుక్ర, శనివారం రోజులలో అల్ట్రాసౌండ్ స్కానర్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన అన్నారు. వైద్యులు పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి వైద్యుల సిఫారసుల మేరకు అల్ట్రాసౌండ్ స్కానర్ వైద్య సేవలు అందించటం జరుగుతుందని అన్నారు. పేద ప్రజలు ఆరోగ్యసేవలు వినియోగించుకోవాలని ఉచితంగ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.పద్మావతి, డాక్టర్ పుష్పాంజలి, డాక్టర్ సౌందర్యలత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఆరోగ్యసేవలు ప్రారంభం,పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి,పాల్గొన్న తదితరుల దృశ్యం



# విత్తు.. విపత్తు..?

- నకిలీ విత్తనాల వలలో రైతులు
- గుట్టుగా బీటీ-3 అమ్మకాలు
- పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేక పోతున్న అధికారులు
- నకిలీ విత్తనాలలో మాడ్గుల మండలం
- మహారాష్ట్ర, గుజరాత్ నుండి దిగుబడి

**రంగారెడ్డిప్రతినిధి,మే 30,ప్రభాతవార్త:** వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే రైతన్నలకు నకిలీ విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల వర్షాలు కురవ దంతో రైతులు ఒక్కదిక్కు పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటూ.. మరోదిక్కు అవసరమైన విత్తనాల కోసం పరుగులు పెడుతున్నారు.అయితే వానాకాలం సీజన్‌లో ప్రధాన వాణిజ్య పంటగా పేరొందిన పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ప్రభుత్వం కూడ ఎక్కువగా ప త్తిపంట సాగుకే ప్రాధాన్యత ఇస్తుంది. ఇదే అదునుగా విత్తన వ్యాపారులు వారికి ఎక్కువ కమీషన్ ఇచ్చే కంపనీలు సరఫరా చేసే విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు.విత్తనాల కొరత అంటూ కృత్రిమ కొరత సృష్టించే కుట్ర జరుగుతుంది.

### మాడ్గులలో గుట్టుగా బీటీ-3 పత్తి విత్తనాలు విక్రయం

జిల్లాలోని శివారు ప్రాతంమైనా మాడ్గుల మండలంలో జోరుగా ప్రభుత్వ అనుమతులు పొందని బీటీ-3 విత్తానాలను జోరుగా విక్రయిస్తున్నట్లు గ్రామాలలో చర్చ జరుగుతుంది.కొంత మంది వ్యాపారులు గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రల నుండి దిగుమతి చేసుకుని రైతుల ఇండ్లలో నిల్వ చేస్తున్నట్లు సమా చారం. మాడ్గుల మండలంలోని బ్రాహ్మణపల్లిలో మహారాష్ట్ర నుండి నేరుగా సూ మారు 5క్వింటాలు బీటీ-3 పత్తి విత్తనాలు దిగుమతి అయినట్లు గ్రామంలో గుసగసలు వినిసిస్తున్నాయి.నెంబర్ ప్లేట్ లేకుండా కారులో వచ్చి విత్తనాలు సరఫార చేసినట్లు గ్రామస్థులు చర్చించుకుటుంన్నారు.గత సంవత్సరం బ్రాహ్మణపల్లిలో నకిలీ విత్తనాలు సరాఫరా చేస్తున్నారన్న సమాచారంతో టాస్కఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.మరోసారి గత మంగళవారం రాత్రి మండలంలోని కొత్త బ్రాహ్మణపల్లి రైతుల ఇండ్లలో బీటీ-3 విత్తనాలు ఉన్నయన్న సమాచారంతో దాడులు నిర్వహించి సూమారు 90 కేజీల బీటీ-3 విత్తనాలు పట్టుకుని మాడ్గుల పోలీస్‌లకు అప్పగించారు.

### గ్లైపోసెట్ ద్రావణం అత్యంత ప్రమాదకరం

బీటీ-3 విత్తనాలకు సంబందించి కలుపు నివారణ రైతాంగానికి కలిసొచ్చే అంశంగా ఉన్నా కలుపు నివారణకు వినియోగించే మందులు భూములపై దుష్ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.ఇవే విత్తనాలను రెండు,మూడేళ్ల పాటు సాగు చేసిన అనంతరం ఆ పొలంలో మరే ఇతర విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదని పేర్కొంటున్నారు.అంతేగాక కలుపు నివారణకు వినియోగించే గ్లెపోసెట్ ద్రావణం అత్యతం ప్రమాదకరమని, దీని వినియోగం వల్ల క్యాన్సర్ వ్యాప్తి చెందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### వ్యవసాయశాఖ అధికారులు అలసత్యం వీడాలి కొత్తపాండుగౌడ్,ఎంపీటీసీ మాడ్గుల

వ్యవసాయ శాఖలో పని చేస్తున్న అధికారులు అలసత్యం వీడాలి. విత్తనాలు అమ్ముతున్న డీరల్లకు అనుసంధానంగా ఉండడంతోనే వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మే ధైర్యం చేస్తున్నారు.గతంలో సర్వయపల్లి రైతు ముత్యంపురెడ్డి నకిలీ విత్తనాలతో భారిగా నష్టపోయారు.మండలంలో ఈ సంవత్సరం భారిగానే నకిలీ విత్తనాలు మండలంలో ఉన్నట్లు సమాచారం ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించడంలేదు. రెతులకు విత్తనాల ప్రాముఖ్యతను చేరవేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వానాకాలం సీజన్‌లో మండల అధికారులు అందుబాటులో లేకపోవడం ఎమిటి..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# పచ్చిరొట్టతో భూమి సారవంతం..పంటకు బలం

### వరికొయ్యలను కాల్చడంతో భూ సారానికి ముప్పు

### ఎకరాకు 15కిలోల జీలుగా,10కిలోల జనుములు చల్లుకోవాలి



**బొంరాస్‌పేట్,మే30,ప్రభాతవార్త :** రైతులు వరి పంటలను కొసిన తర్వత వరికొయ్యలను కాల్చడంతో భూ సారానికి ముప్పు ఏర్పాడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మన నేలలో 95'% భూములలో సేంద్రయ పదార్థం తక్కువగా ఉంది. పొలంలో సేంద్రయ పదార్థం పుష్కలంగా ఉంటేనే భూమిలో ఉండే సూక్ష్మజీవులు వృద్ధిచెంది మొక్కలకు అవసరమైన పోషకాలతో పాటు నీటిని నిల్వఉండే గుణము పంటల దిగుబడి పెరిగే ఆవకాశం ఉంటుంది రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కొయ్యలను కాల్చరాదని అనేక సార్లు వివరించిన రైతుల ఆలోచన మారడంలేదన్నారు.కొయ్యలను కాల్చడంతో పంట పొలంలో ఉండే క్రిమికీ టకాలు,సూక్ష్మజీవులు,కాలిపోవడంతో భూ సారానికి ముప్పు ఏర్పాడుతుందని వ్యవసాయ అధికారులు అంటు న్నారు.

### వరికొయ్యలను పంట పొలంలో కలియ దున్నడంతో లాభాలు

వరికొయ్యలను పంట పొలంలో కలియ దున్నడంతో భూసారం పెరుగుతుం దని వ్యవసాయ అధికారులు రైతుల కు సూచిస్తున్నారు.పంటపొలంలో మొక్క లకు కావల్సిన 18 రకాల మూలకాలలో రైతాంగం కేవలం 3రకాల పోషకాలు, ఎరువులను మాత్రమే వాడుతున్నారు.మిగతా 15 రకాల మూలకాలు మొక్క లకు భూమి ద్వారానే సమకూరుతుంది.భూమిలో సేంద్రియ పదార్థం లేకుండా నత్రజని,భాస్వరం,పోటాష్ ఎరువులు మోతాదుకు మించి వెసినట్లయితే భూ మికి సుస్థిరమైన దిగుబడులను ఇచ్చే శక్తి కోల్పోయి ముంది తరాలకు పంటలు పండించడానికి భూమి పనికిరాకుండా పోతాయి.

### ఎకరాకు 15 కిలోల పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి

దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి పచ్చిరొట్ట ఎరువులను వేసుకుంటే గాలిలో ఉండే నత్రజని చెట్టు వేర్లలో స్థిరీకరించి మొక్కలకు సేంద్రియ నత్రజనిని అందిస్తాయి.నత్రజని ఎరువులతోపాటు అన్ని రకాల ఎరువులను అందించడమే కాకుండా భూమి భౌతీక,రసాయనిక స్థితుల ను సమతుల్యంగా ఉంచుతూ అధిక దిగుబడులనిచ్చే శక్తి పచ్చిరొట్ట ఎరువులు భూమికి అందిస్తుంది.పచ్చిరొట్ట పైర్లను పంటకుముందు వేసి45 రోజులలోపు భూమిలో కలియదున్నాలి.చౌడు నేలలో అయితే వరిపొలంలో జీలుగాలు వేసుకోవాలి.మిగత నేలలు, పంటలకు జనుములు,పిల్లిపెసర,పెసర,ఉలవలు వేసుకోవాలి.నత్రజని వృధాగా పోకుండా కనీసం 15 నుండి 22 సెంటీమీటర్ల లోతు కలియదున్నాలి. ఎకారం భూమిలో పచ్చిరొట్ట ఎరువుల మోతాదు 15 కిలోల జీలుగా విత్తనాలను చల్లుకోవడంతో మనం భూమికి 70 నుండి 85 కిలోల యూరియాను వేసిన దానితో సమానం ఉంటుంది.అలాగే 10కిలోల జనుములు చల్లుకోవడంతో భూమికి 40 నుండి 50 కిలోల యూరియా వాడిన దానితో సమానంగా ఉంటుంది.

### రైతులు వరికొయ్యలను కాల్చడంతో భూసారం తగ్గుతుంది

### ఎఈఓ ఐజాక్ హెరాల్డ్

వరి పంట కొసిన అనంతరం రైతులు వరికొయ్యలను కాలుస్తున్నారు దీంతో భూమిలో భూసారం తగ్గడంతో దిగుబడులు కూడా తగ్గుతాయి. తర్వత భూమిపై ఎన్ని ఎరువులు వేసిన ప్రయోజనం ఉండదు.దీనికి బదులుగా దుక్కిని చదును చేసుకోవడం మంచిదని రైతులకు ఎన్నిసార్లు చెప్పిన మారడంలేదు మార్పు రావాలి.ఎకరా భూమిలో జీలుగా 15 కిలోలు,జనుములు 10కిలోల చొప్పున పచ్చిరొట్ట పైర్లను చల్లుకోవడంతో భూసారం పెరడంతోపాటు పంటది గుబడులు కూడా పెరుగుతాయి.

### పచ్చిరొట్ట పైరు వేయడంతో వలన అనేక ప్రయోజనాలు

పచ్చిరొట్ట పైరులుగా ల్యెమ్ జాతి పంటలనే వేయాలి గాలిలో నత్రజని వేరు బుడిపలో స్థిరికరించి సేంద్రియ నత్రజనిని పంటలకు అందిస్తుంది.భూమిలో పచ్చిరొట్ట పైరు కుళ్లినప్పుడు రసాయనిక ప్రక్రియజరిగి భూమిలోని పోషకాల ను మొక్కలకు అందిస్తాయి.అలాగే లోతు పొరలో కుళ్లడం వలన తర్వత పంటకు తేలికగా పోషకాలు లభిస్తాయి. సేంద్రియ పదార్థ ఉన్నందున పంట పొలంలో సూక్ష్మజీవులు, వానపాములు, విస్తరంగా అభివృద్ధి చెంది భూసారాన్ని పెంచుతాయి. దీనవలన ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా పంట బెట్ట నుండి తట్టుకోవడం, రోగనిరోదక శక్తి పెరగడం జరుగుతుంది. జీలుగా, జనుములు వేసి కలియదున్నడం వలన ఎరువుల ఖర్చులు తగ్గి కలుపు సమస్య తగ్గుతుంది. పంటలో గింజల బరువు పెరుగుతుంది.నేల గుల్లబారేటట్లు చేసి 15 నుండి 20 శాతం దిగుబడి పెరగడంతోపాటు నేల నాణ్యత కూడ పెరుగుతుంది.



## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం ఆదాయం రూ. 2.92 లక్షలు



లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 30 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు గురువారం జరిగింది. 70 రోజులకుగాను ఆలయానికి రూ.2లక్షల92వేల091 ఆదాయం లభించింది. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. అర్చకులు కందాల వెంకటాద్రి,ఆచారి, సిబ్బంది పాల్గొన్నారు. జూన్ 1న హనుమాన్ జయంతి కాగా వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయం ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. ఆలయంలో స్వామివారికి మన్యుసూక్తపూర్వ సింధూరాభిషేకం, ఆకుపూజ, వడమాల తదితర పూజా కార్యక్రమాలుంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## భారత రాజ్యాంగాన్ని పరరక్షించుకోవాలి

**-విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్**




ప్రసంగిస్తున్న విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**చిక్కడపల్లి, మే 30 ప్రభాతవార్త:**
దేశ ప్రజలకు సమానత్వాన్ని జీవించే హక్కులను అందించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని విశ్రాంత హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) నాల్గవ మహాసభ సందర్భంగా భారత రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం జరిగింది. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపిచేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ప్రజలందరికి ఉచిత విద్య, వైద్యాన్ని అందించాలని, ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో హత్యలుచేయడం తగదన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగపురి ప్రీతం మాట్లాడుతూ ఆర్థిక, అసమానతలు కొనసగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు జరిగే అన్యాయాలను అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు ప్రతి వవారం ఎస్సీ హాస్టల్‌లో నిద్రపోయి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో జాతీయ విద్యావిధానంపై చర్చించకుండా తీసుకురావడం తగదన్నారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జెండాను వ్యవస్థాపకులు కొరివి వినయకుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సజయ, డిబిఎఫ్ జాతీయ ప్రదాన కార్యదర్శి మేళం బాగ్యారావు, జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్, ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, ఎన్ఆర్ఐ మంతెన రాందాస్, పిఎంసి రాష్ట్ర కన్వీనర్ శివలింగం, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, తెలంగాన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, పట్టా వెంకటేశ్వర్లు, సిస్టర్ లిజి, సీనియర్ జర్నలిస్ట్ అస శ్రీరాములు, మైసయ్య, వనపర్తి నాగరాజు, అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకులు దివాకర్,డిబిఎఫ్ నాయకులు పులి కల్పన,బొర్ర సంపూర్ణ, లావణ్య చుంచు రాజేందర్,దాసరి ఎగొండ స్వామి,దుబాషి సంజీవ్ పాల్గొన్నారు.

## విద్యను సేవా దృక్పథంతో చూడాలి : మైనంపల్లి



పాఠశాల ప్రారంభోత్సవంలో మైనంపల్లి

**అల్వాల్, మే 30 ప్రభాతవార్త:** అల్వాల్‌లో ఐరిజ్ గ్లోబల్ స్కూల్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్ ఇతర ప్రముఖులు ప్రారంభోత్సవంలో పాలు పంచుకున్నారు. విద్యను వ్యాపారంలా కాకుండా సేవా దృక్పదంతో చూడాలని మైనంపల్లి కోరారు. ఈ కార్యక్రమంలలో పాఠశాల డైరెక్టర్ నచికేత్, రిషిత రుమాల తదితరులు పాల్గొన్నారు.

## క్యాబ్‌డ్రైవర్‌పై బేడ్‌తో ఆకతాయిల దాడి

**-సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుండి డబ్బులు, ఫోన్‌లు చోరీ**

**కుత్బుల్లాపూర్, మే 30 ప్రభాతవార్త :** అర్థరాత్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను చేరవేసే క్యాబ్‌డ్రైవర్‌పై కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో దాడికి పాల్పడటంతో పాటు క్యాబ్‌డ్రైవర్‌ను బ్లేడ్లతో దాడీచేసి గాయపరిచిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిదిలోని నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం హైటెక్‌సిటీ మాదాపూర్ నుండి గురువారం రాత్రి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌కు క్యాబ్‌డ్రైవర్ అనిల్ (24) ఇద్దరు సాఫ్ట్‌వేర్‌లతోకలిసి వస్తున్నాడు. ఇదే సమయంలో నెహ్రూనగర్‌కు చెందిన ఆకతాయిలు మద్యం మత్తులో క్యాబ్‌ను అడ్డుకుని అందులోనుండి డ్రైవర్ అనిల్‌ను బయటకు లాగి తీవ్రంగా గాయపరవడంతో పాటు కారుక్యాబ్‌లో ఉన్న ఇద్దరు సప్ట్‌వేర్ ఉద్యోగులను బెదిరించి వారివద్దగల సెల్‌ఫోన్‌లను, పర్సులోవున్న నగదును లాక్కున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన క్యాబ్‌డ్రైవర్ అనిల్‌ను స్థానికంగా గల ప్రైవేట్‌ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం క్యాబ్‌లో ప్రయాణిస్తున్నవారు పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడింది నెహ్రూనగర్‌కు చెందిన మున్నా, రాజాసింగ్, అఖిల్‌గా గుర్తించారు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**కొంపల్లి, మే 28, ప్రభాతవార్త :** చెట్ల కొమ్మలను కత్తిరించడం వలన నేడు ఉదయం 11కేవీ జీబిఆర్ ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పిఎస్ఆర్ సమావేశ రహదారి, రిలియన్స్ పెట్రోల్ బంక్, సయ్యద్‌నగర్, ప్యారడైజ్ రోడ్, టొబాకో కంపెనీ రోడ్, జీబిఆర్ కల్చరల్ క్లబ్ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ శాఖకు సహకరించగలరని ఏఈ వినాయక్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

**జీడిమెట్లలో :** 33/11 కేవీ జీడిమెట్ల సబ్‌స్టేషన్ నుండి 11కేవీ షాపూర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 13:30 గంటల నుండి 1 గంటల వరకు న్యూ షాపూర్‌నగర్, ఎన్ఎల్‌బీ నగర్, సంజయ్‌గాంధీ నగర్, కళావతి నగర్ అలాగే 11కేవీ అయోధ్య నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి 4:30 గంటల వరకు అయోధ్యనగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ శాఖకు సహకరించగలరని ఏఈ ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు.

**నిజాంపేట్‌లో** 11కేవీ సాయినగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5 గంటల వరకు సాయినగర్, ఏఎన్‌జి ఆర్‌జీకే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ శాఖకు సహకరించగలరని బాచుపల్లి ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజముద్ర , రాష్ట్ర గీతంలో చేస్తున్న మార్పులను స్వాగతిస్తున్నాం : కోట శ్రీనివాస్



మాట్లాడుతున్న కోట శ్రీనివాస్ తధితరులు

**తార్నాక, మే 30 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రజా పాలనలో రాజముద్ర, రాష్ట్ర గీతంలో చేస్తున్న మార్పులను తెలంగాణ విధ్యార్థులుగా తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమ కారుడు, టీపీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహకుడు కోట శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద విద్యార్థి నాయకులతో జరిగిన సమావేశంలో కోట శ్రీనివాస్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అందరూ అనచివేతకు గురయ్యారని ఆరోపించారు. సాధించుకున్న తెలంగాణ అస్తిత్వ పోరాటానికి చిహ్నం టీజీ దానిని తీసేసి టీఎస్‌గా గత ప్రభుత్వం పెట్టారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక పోరాట చరిత్ర ఉందని దానిని తుడిపేసి ఎటువంటి శాస్త్రీయ పరమైన చర్చలేకుండా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి జిల్లాల చరిత్రను, అస్థిత్వాన్ని కేసీఆర్ ద్వంసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఎంచుకున్న రాజముద్రలో తెలగాణ తల్లి విగ్రహంలో ఎక్కడ కూడా ప్రజల ఉద్యమ ఆనవాళ్లు కాని మట్లి తల్లుల ఆనవాళ్లు కాని లేవన్నారు. అమరుల త్యాగాల గుర్తులే ఆ గుర్తులే లేని రాచరికపు పోకడలు ఉన్న రాజ ముద్ర మాకెందుకన్నారు. రాజకొండ చవరి రాజుగా ఉన్న వెలమ రాజు అయిన సర్వజ్ఞ సింగభూపాలుడు కేసీఆర్ కూడా తనకు తాను అభినవ సింగభూపాలుడుగా అభిర్ణించుకున్నాడని ఆరోపించారు.అందుకే రాచకొండ కమీషనరేట్ గా పేరుపెట్టరన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి భాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ ఎదుర్కోన్నానని పేర్కొన్నారు. యాదాద్రి పునరుద్ధరణ ఆర్ట్స్ డైరెక్టర్ ఆనంద్ సాయికి, కాలేశ్వరం కాంట్రాక్ట్ మేఘా కృష్ణారెడ్డిది ఏ ప్రాంతం అని ప్రశ్నించారు. తెలంగాణ బ్రాడ్ అంబాసిడర్‌గా సమంతను ఏవిధంగా పెట్టారని ఎద్దేవ చేశారు. అప్పుడు గుర్తు రాలేదా తెలంగాణ అస్థిత్వం అంటూ ఎద్దేవ చేశారు. రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ప్రజలు కోరుకుంటున్నట్లుగా రేవంత్ రెడ్డి ప్రజా పాలన ముందుకు వెళ్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచాల సతీష్, వెంకట్ నాయక్, పవన్, జశ్వంత్, కొరివి బాలకృష్ణ, నాంపల్లి వెంకటరమణ, రాము, కొంపల్లి వినయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ గడ్డ... బిఆర్ఎస్ పార్టీ అడ్డా : ప్రకాశ్‌గౌడ్

**- అర్ధరాత్రి పిలిచినా మీ వద్ద వాలిపోతా**

**- ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన్నే ఉంటాం**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, మే 30 ప్రభాతవార్త :**
ఎంత మంది నాయకులు పార్టీలు మారినా, రాజేంద్రనగర్ గడ్డ... బిఆర్ఎస్ పార్టీ అడ్డాగానే ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు అంతారం నరేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశాకి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మందిని కార్యకర్తల స్థాయి నుంచి నాయకులుగా తీర్చిదిద్దామని, కొంత మంది పార్టీని వీడి వెళ్లారని, మళ్లీ సమరులైన నాయకులను తయారు చేసుకుందామన్నారు. పార్టీ జెండాలు మోసిన కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ప్రత్యేక గుర్తింపునిస్తుందన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేసే వారికి పదవులు ఇవ్వడం జరగుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని, ఇతర పార్టీలకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమవుతున్నాయన్నారు. 100.రోజుల్లో 6.గ్యారెంటీలు అమలు చేస్తామని జూటా హామీలిచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కి ఆరు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మహిళలకు రూ. 2,500, వృద్దులకు రూ.4.వేల పించన్లు ఎక్కడా, ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మీ, రైతు బంధు, రైతు భీమా ఇలా అనేక సంక్షేమ పతకాలను మూలన పడేసి రైతులు, మహిళలు, వృద్దులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పార్టీని వీడి వెళ్లిన వారిని మళ్లీ పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ మేయర్ బి.మహేందర్ గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పోరేటర్లు సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు నవాబ్ ముంతాజ్, పాపయ్య యాదవ్, సురేష్‌గౌడ్, రజాక్, యాదిరెడ్డి, సుమన్‌గౌడ్, రాజు, మల్లేష్ యాదవ్, రాజశేఖర్, హరీష్‌గౌడ్, సుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధం నిర్వీర్యం

**-నగరంలో కొనసాగుతున్న గుట్కా విక్రయాలు**

**-తనిఖీలు చేయని పోలీసులు -ఖాతరు చేయని వ్యాపారులు**



మాదాపూర్ ప్రాంతంలో దుకాణాల్లో లభ్యమవుతున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్లు

**హైదరాబాద్, మే30, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని పక్కకు పెట్టి నగరంలోని పలు ప్రాంతాల్లో గుట్కా, ఖైనీ, పాన్ మసాలాల విక్రయాలు కొనసాగుతున్నాయి. మాదాపూర్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వంటి పలు రద్దీ ప్రాంతాలలో దుకాణదారులు, పాన్ డబ్బా వ్యాపారులు గుట్కా ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతాలలోని పలు దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లను బహిరంగంగానే విక్రయిస్తున్నారు. నిషేధిత గుట్కా, ఖైనీ, పాన్ మసాలాలను ఎందుకు విక్రయిస్తున్నారని అడిగితే దుకాణదారులు ప్రభుత్వ నిబంధనతో తమకేమీ పట్టనట్టే వ్యవహరించారు. వివిధ జిల్లాల నుంచి గుట్కా ప్యాకెట్లు నగరానికి తరలిస్తున్నప్పటికీ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెలువడుతున్నాయి. వాటిని నిజం చేస్తూ పలు ప్రాంతాలలో వారు చేసిన తనిఖీలు నామమాత్రానికే పరిమితమయినట్లు, చాలా చోట్ల అసలు తనిఖీలే చేయనట్లు తెలుస్తోంది. దాంతో గుట్కాపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కొనుగోలు దారులు, వ్యాపారుల నిర్లక్ష్యం అనేది కప్పేసినట్లు తేటతెల్లమైంది.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి..

**పేట్ బషీరాబాద్, మే 30, ప్రభాతవార్త**

భవనం పై నుండి కిందపడిన యువకుడు.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి క్రిష్ణానగర్ కాలనీకి చెందిన రేగడి రాము (26) దూలపల్లి పారిశ్రామికవాడలో రాయల్ అగ్రిలైఫ్ సెన్సెస్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇంటి నుండి కంపెనీకి రోజు నడుచుకుంటూ వచ్చిపోవాలంటే ఇబ్బంది అవుతుందని గత మూడు నెలల కిందట నుండి వర్కర్ల కోసం కంపెనీ నిర్వాహకులు అదే ప్రాంతంలో కిరాయికి తీసుకున్న ఓ భవనం మొదటి అంతస్తులో బీహార్‌కు చెందిన కార్మికులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 26న ఆదివారం రాత్రి రాము రూమ్‌లో ఉన్న ఇద్దరితో పాటు అదే ప్రాంతంలో ఉన్న మరో నలుగురు కార్మికులు మొత్తం ఏడుగురు కలిసి మద్యం సేవించారు. పైగా బిల్డింగ్‌పై పడుకున్న తరువాత ఫోన్ మాట్లాడుకుంటూ పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై పడడంతో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మల్లారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29న రాత్రి 11.5 గంటలకు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లారెడ్డి గుడాలో భర్త దాష్టీకం

**-అదనపు కట్నం కోసం భార్యను చావబాదాడు**

**-మూడు రోజులు గదిలో నిర్బంధం**

**-నిందితుడిపై గృహహింస కేసు**



**హైదరాబాద్, మే30, ప్రభాతవార్త:**
అదనపు కట్నం కోసం ఆశ పడిన వ్యక్తి పాలు విరిగాయనే సాకుతో తన భార్యను కొట్టి, హింసించి గృహనిర్భందం చేసిన అమానవీయ ఘటన అమీర్‌పేట ఎల్లారెడ్డి గూడా ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, అక్మల్ హుస్సేన్, హీనా బేగం అనే దంపతులు తమ కుటుంబంతో కలిసి ఎల్లారెడ్డి గూడాలో నివాసముంటున్నారు. గత కొంత కాలంగా అక్మల్ హుస్సేన్‌కీ, అతడి భార్యకీ గొడవలు జరుగుతున్నాయి. అంతే కాకుండా అదనపు కట్నం కోసం బాధితురాలు హీనాని అత్తింటివారు ఏదో ఒక సమయంలో రోజూ చిత్రహింసలకు గురి చేసేవారని సమాచారం. ఈ క్రమంలో బుధవారం పొయ్యి మీద పెట్టిన పాలు విరగడంతో, సాకు దొరికిందని భావించిన భర్త, అపశకునంగా భావించి పట్టరాని కోపంతో తన భార్యను ప్రాణం పోయేలా దాడి చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. అంతే కాకుండా ఆమెను మూడు రోజుల పాటు ఒక గదిలో నిర్భందించి మరీ దాడులకు పాల్పడ్డాడు. అతడి దెబ్బలకు తట్టుకోలేక అపస్మారక స్థితిలో ఉన్న హీనాను చనిపోయిందనుకుని ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి, మీ కూతురు చనిపోయిందని చెప్పడంతో వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. హుటాహుటీన తమ కుమార్తె అత్తారింటికి వెళ్ళి చూడగా ఆమె ప్రాణాలతోనే ఉన్నా గానీ, అపస్మారక స్థితిలో, ఒళ్ళంతా దెబ్బలతో ఉండడం చూసి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. బాదితురాలి నుంచి, ఆమె కుటుంబం నుంచి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు నిందితుడు అక్మల్ హుస్సేన్‌పై, అతడి కుటుంబంపై గృహహింస కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కొసరు కూల్చివేసి అసలు వదిలేసిన అధికారులు...

**-చెరువు ఆక్రమణ కూల్చివేతపై శేరిలింగంపల్లి అధికారుల వింత వైఖరి**

**-ప్రహరీ గోడను కూల్చి చేతులు దులుపుకున్న వైనం**



అధికారులు కూల్చివేసిన పెద్దచెరువు బఫర్‌జోన్ అక్రమ నిర్మాణం



ప్రహరీని కూల్చి గదిని వదిలేసిన దృశ్యం

**గచ్చిబౌలి, మే 30 ప్రభాతవార్త**
తాళం వేసితిని... గొళ్లెం మరిచితిని... అన్న చందంగా ఉంది శేరిలింగంపల్లి సర్కిల్ అధికారుల వైఖరి. ఖాజాగూడ పెద్ద చెరువును శిఖం స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాల కూల్చివేత పేరుతో హడావిడీ చేసిన అధికారులు ప్రహరీ గోడను కూల్చివేసి అసలు గదిని వదిలేశారు. బుధవారం అధికారులు ప్రహరీని కూల్చివేయగా, గురువారం గదిలో కబ్జారాయుళ్ల అక్కడే నివాసం ఉండి అక్రమణలో ఉంచుకోవడం విశేషం. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ పెద్ద చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణంపై శేరిలింగంపల్లి జోనల్ అధికారులు పిర్యాదులు అందుకున్నారు. కబ్జాదారులు పెద్దచెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి రోడామిస్ట్రీ కళాశాలకు ఆనుకొని గది నిర్మాణం, గది చుట్టూ తాత్కాలిక ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీంతో జోనల్ కమీషనర్ శ్నేహ శబరీష్ ఆదేశాల మేరకు బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు అక్రమ నిర్మాణం కూల్చివేత చేపట్టారు. కబ్జాదారులకు మొదట నోటీసులు జారీ చేసిన అనంతరం బుధవారం కూల్చివేత చేపట్టారు. కాగా బఫర్ జోన్‌ను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేయకుండా అధికారులు పాక్షికంగా కూల్చివేతలు చేపట్టడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం అక్రమ నిర్మాణం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసి చేతులు దులుపుకున్న అధికారులు కాంపౌండ్ వాల్ లోపల ఉన్న గదిని మాత్రం ముట్టుకోలేదు. గదిలో సామాగ్రితో సహా ఆక్రమణదారులు నేటికి అక్కడే తిష్టవేశారు. దీంతో తూతూ మంత్రంగా చేపట్టిన కూల్చివేతలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ గోడ బఫర్ జోన్ పరిధిలో ఉంటే గది బఫర్ జోన్ పరిధిలో రాదా అని ప్రశ్నిస్తున్నారు.

# కులగణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

**-బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్**



ప్రసంగిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు, బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్

**చిక్కడపల్లి,మే 30 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థల్లో 43శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా బీసీ, ఎంబీసీలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు, బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్(బిఎల్ఎఫ్) ఆధ్వర్యంలో 'స్థానిక ఎన్నికలు-బీసీ రిజర్వేషన్‌లు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నల్లా సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ మాట్లాడుతూ ఆధిపత్య కులాల యాజమాననయంలోని రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ లాంటి ఆధిపత్య పెట్టుబడిదారీ పార్టీలు ఎన్నికలను లాభసాటి వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. తెలంగాణ సమాజంలో నూటికి 65శాతం ఉన్న బీసీ కులాల ఓట్లు దండుకోనుని గద్దెనెక్కడానికి ఎన్నికల ముందు బీసీ కులాలపై ఎనలేని ప్రేమను ఒలకబోస్తూ, ఎన్నికల అనంతరం బీసీ కులాలను రాజకీయ, ఆర్థిక, సామాజికంగా విస్మరిస్తాయని ఆరోపించారు. నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్‌లు ఉండడం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నతస్థానానికి రాణించగలుగుతున్నారన్నారు. దేశరాజధానిలో దాదాపు 60శాతం ఉన్న బీసీ జాతులకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటటి చట్టసభలకు రాజ్యాంగపర రాజకీయ రిజర్వేషన్‌లు లేకపోవడం వల్లనే బీసీ సమాజం వెనుకబాటుకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి సాధించగలదని చరిత్ర చెబుతున్న సత్యమిదేనన్నారు. అయితే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల కనుసన్నులలో మెదిలే రాజకీయ బానిసల పట్ల స్వయం గౌరవం ఉన్న బీసీలు, ఎస్సీ,ఎస్టీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బీసీ సమాజానికి ఈ బానిసల నుంచి మొదటి ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బెజెపి, బిఆర్ఎస్ లాంటి ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పనిచేసే ఎస్సీ,ఎస్టీ, బీసీలు తమ జాతి ప్రజల ప్రయోజనాల కంటే తమ బంధువుల వారసుల కోసమే జాతి ప్రయోజనాలను తాకట్టుపెడుతుంటారని విమర్శించారు. పార్టీ ఏదైనా ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పనిచేసే వారికి ఎప్పుడు స్వయం గౌరవ(ఆత్మగౌరవం) ఉండదని, ఇలాంటి వారినే మాన్యవర్ కాన్షీరామ్ 'రాజకీయ చెంచాలుగా' పోల్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును గంపగుత్తగా కొనుగోలు చేస్తున్న పరిస్థితిని, చూస్తుంటే సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమిసునతన్న విప్లవశక్తులు నిస్సహాయంగాచూడాలల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా సమావేశం పలు డిమాండ్‌లను ఆమోదించింది. కులజనగణన బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్ అమలుతో ఎన్నికలు నిర్వహించాలని, బీసీ, ఎంబిసిలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో బహుజన కమ్యునిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి, మార్క్సిస్ట్, లెనినిస్ట్ రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజేశ్, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనంసుధాకర్, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు మారోజు సునీల్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్డసాయికృష్ణ, మాస్ సావిత్రతి, ధనలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మురళీ, గడ్డం నాగార్జున, శ్రీశైలం, బిబి.నాయక్, మార్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరుపెట్టాలి

**- ఏకకంఠంతో ప్రముఖులు**

**-వైభవంగా తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి**



డా. సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బాలాచారి, బడేసాబ్, ప్రకాశ్‌రెడ్డి, రాధాకుసుమ తదితర తదితరులు

**రవీంద్రభారతి, మే 30 ప్రభాతవార్త :**
సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయిన సందర్భంగా విభజనచట్టం నిబంధనల ప్రకారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరుమార్చు కోవచ్చు కనుక ఈ విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డితో నామకరణ చేయాలని గురువారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వైభవంగా జరిగిన ఆయన జయంతి సభలో తెలుగుభాషా చైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బడేసాబ్ పై పేరును ప్రతిపాదించి తీర్మానం చేయగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారితో పాటు ప్రముఖ అతిథులంతా హర్షధ్వానాల మధ్య ఏకగ్రీవంగా అంగీకరించి, ఏకకంఠంతో అంగీకారం తెలిపారు. ప్రభుత్వం తరఫున డా. సినారె, కాళోజీ, దాశరథి తదితర తెలంగాణ వైతాళి కుల పేర్లమీద పురస్కారాలు అందజేస్తున్నట్లే ఇకముందు సురవరం ప్రతాపరెడ్డి పేరుమీద కూడా పురస్కారం అందించడానికి సాహిత్య అకాడమీ తరఫున కృషిచేస్తానని హామీనిచ్చారు. ప్రతాపరెడ్డి గ్రంథస్త కాని రచనలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తప్పక ముద్రిస్తా మని స్పష్టం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగుభాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళాసమితి, కుసు మ ధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య కళాపీఠం, లక్ష్మసా ధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డా. అర్ధచంద్ర ప్రకాశ్‌రెడ్డి సభా ధ్యక్షతన జరిగిన ప్రతాపరెడ్డి జయంతిసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. ఎన్.బాలాచారి విశిష్ట అతిథులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, డా. వేణుకుమార్, దామోదర్‌రావు, గణేష్, పి.బడేసాబ్, డా. రాధాకుసుమ తదితరులతో కలిసి సురవరం ప్రతా పరెడ్డి కుమారుడు డా. కృష్ణవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు.

## సామాజిక వికాసానికి విద్యార్థులకు పుస్తకపఠనం,రచనాభిరుచి అవసరం

**-రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణమండలి డైరెక్టర్ రాధారెడ్డి**

**-విజయవంతంగా ముగిసిన రెండురోజుల బాలసాహిత్య సమ్మేళనం**



పరిషత్తు బాలసాహితీ సమ్మేళనంలో పాల్గొన్న సన్మానగ్రహీతలతో రాధారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య తదితర అతిథులు

**నాంపల్లి, మే 30 ప్రభాతవార్త :**
సామాజిక వికాసానికి బాటలు వేయగానికి విద్యార్థులకు పుస్తకపఠనం, రచనాభిరుచి ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణమండలి డైరెక్టర్ ఎం.రాధారెడ్డి అన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఈ విషయంలో కీలకమైన బాధ్యత నిర్వహించాలని సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన కోదూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళన సమాపనోత్సవం గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె ప్రసంగించారు. బాల్యదశలోనే ఉత్తమగుణాలను, మాతృభాషాభిమానాన్ని పెంపొందించడం ఆవశ్యకమన్నారు. పరిషత్తు కృషితో బాలల సమగ్ర మూర్తిమత్వ వికాసానికి రూపొందించిన 5 గ్రంథాలను రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం తరఫున అందిస్తామని రాధారెడ్డి భరోసానిచ్చారు. పరిషత్తు బాలల కథాసంకలనాల కోసం ఆహ్వానించిన కథల్లో ఉత్తమ కథలకు రాధారెడ్డి చేతులమీదుగా 8మంది పెద్దలు, 5మంది విద్యార్థి రచయితలకు వెయ్యి, ఐదువందల రూపాయల చొప్పున బహుమతులు, శాలువాతో సత్కారం చేశారు. సభకు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతం పలుకగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం కావించి, ఈ సమ్మేళనంలో నిర్వహించిన సదస్సులన్నింటికీ మంచి స్పందన లభించిందని వివరించారు. చివరిగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు తిలక్‌నగర్‌లోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో 2రోజుల కోదూరి శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం నేడు విజయవంతంగా ముగిసింది.



వినతిపత్ర అందిస్తున్న ఉపాధ్యాయులు

## సమ్మర్ వెకేషన్ ఈయల్స్ మంజూరు చేయాలి

**బొంరాస్‌పేట్,మే30,ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సమ్మర్ వెకేషన్ ఈయల్స్ మంజూరు చేయాలనివికారాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి రామ్‌రెడ్డి,ఎస్సీ కార్పొరేషన్ ఏడికి మండల ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మర్ వెకేషన్లో ఏఏపీసీ మరమ్మత్తు పనులలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు భేషరతుగా వెకేషన్ ఈయల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గౌరారం గోపాల్, కూర సర్సింహులు,పిఆర్‌టీయూ నాయకులు అనిల్‌కుమార్, నరేందర్, జలంధర్‌రెడ్డి,తపస్ నాయకులు బాకారం చంద్రశేఖర్,క్లస్టర్ ఎచ్ఎంలు హరిలాల్,శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమ ఫలితంగానే జూనియర్ కళాశాల మంజూరు

**బొంరాస్‌పేట్,మే30,ప్రభాతవార్త :** లంబాడి హక్కుల పోరాట సమితి ఉద్యమఫలితంగానే నేడు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏఆర్పాటు చేయడం జరిగిందని ఎల్‌ఎచ్‌పిఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు సూర్యనాయక్ అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లంబాడి హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో అనునిత్యం అనేక రకాల పోరాటాలు,ధర్నాలు,రాస్తారోకోలు,దీక్షలను చేపట్టడం జరిగింది.ఉద్యమాల ఫలితంగానే నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఎస్సీ,ఎస్‌టీ,బిసి,మైనార్టీల కోసం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ చదువును మధ్యలోనే చదువులకు దూరకాకుండా ఉండేందుకు అనేక ఉద్యమాలను చేయడం జరిగిందన్నారు.నాటి ఉద్యమాల ఫలితంగా కళాశాలను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని కళాశాల ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

## జూన్ 3న మండల సర్వసభ్య సమావేశం

**మండల ఎంపిపి గనుగుర్తి నక్షత్రం జావంత్**

**మొయినాబాద్,మే 30,ప్రభాతవార్త:** జూన్ 3వ తేదీన మొయినాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందని మొయినాబాద్ మండల ఎంపిపి నక్షత్రం జావంత్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 3వ తేదీన మొయినాబాద్ మండలంలోని ప్రజా సమస్యలపై తాగు నీటి సమస్యలపై తాగునీటి సమస్యలపై వచ్చే వర్షాకాల సమస్యలను ముందస్తుగా పసిగట్టి సకాలంలో ప్రజలకు కావాల్సి నటువంటి అవసరాలను గుర్తించి చర్యలు తీసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి ఎంపి టిసిలు గ్రామ కార్యదర్శులు తప్పని సరిగా పాల్గొనాలని ఆమె తెలిపారు.

### నాణ్యమైన విత్తనాలు వాడాలి

**జిల్లెడు చౌదరిగూడ, మే 30,(ప్రభాతవార్త):** వచ్చే వర్షాకాలంలో రైతులు తమ పంట పొలాల్లో నాణ్యమైన విత్తనాలు మాత్రమే వాడాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు సూచించారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల, కాస్లాబాద్, ముష్టిపల్లి, ఎదిర, గుర్రంపల్లి, జిల్లెడు, పెద్ద ఎల్కిచర్ల, గాలిగూడ గ్రామాల్లో రైతులకు అవగా హన కార్యమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సి న జాగ్రతలు ఎప్పటికప్పు డు తెలుసుకోవాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత వ్యవ సాయ అధికారుల వద్ద సూచనలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ అనుమ తులు పొందిన షాపులలో మాత్రమే విత్తనాలు, ఎరువుతు తీసుకోవాలని అ న్నారు. వారి నుంచి తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని వారు సూచించా రు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసామ విస్తరణ అధికారులు రాజేశ్వరి, స్వాతి, గౌరిప్రియ,రైతులు తదిరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ స్థలం అక్రమణకు యత్నించిన వారిపై కేసు నమోదు

**ఘట్‌కేసర్ రూరల్, మే 30, ప్రభాత వార్త:** మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు. పోచారం పోలీస్‌స్టేషన్ సీఐ తెలిపిన కథనం ప్రకారం పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్‌లోని సర్వేనెంబర్లు 137,138లలోని రెండు ఎకరాల భూమి మున్సిపల్‌కు చెందిందికాగా యంనంపేట్‌కు చెందిన పోలగోని రాజేందర్ గౌడ్ మరి కొందరితో కలిసి స్థలానికి ఉన్న ఫెన్సింగ్ తొలగించి లోపలికి ప్రవేశించి జెండాలు పాతారు. దీంతో మున్సిపల్ కమిషనర్ వేమారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కబ్జాకు యత్నించిన రాజేందర్‌గౌడ్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**మాడ్గుల,మే30,ప్రభాతవార్త:** మాడ్గుల మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షురాలు గౌరవరం పద్మారెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు ఇంచార్జీ ఎంపీడీఓ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు.డివిజన్, మండల స్థాయి అధికారులు తమ పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావలని కోరారు.

## సురేష్ చంద్రారెడ్డికి ఘనంగా వీడ్కోలు



ఎస్‌ఈ సురేష్ చంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**తలకొండపల్లి,మే30,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా పంచాయతీ రాజ్ ఎస్‌ఈ సురేష్ చంద్రారెడ్డి పదవి విరమణ సందర్భంగా వారిని సన్మానించి వీడ్కోలు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ కోళ్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కు అందజేత

**కొడంగల్,మే 30ప్రభాతవార్త** పేదింటి ఆడపడుచుల పెళ్ళిళ్ళకు కళ్యాణలక్ష్మీ పథకం ఎంతో అసరాగా నిలుస్తుందని కాంగ్రేస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ అన్నారు.మండల పరిధిలోని చిట్లపల్లి తండాకు చెందిన కమిలిభాయికి ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కును గురువారం ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆర్దిక స్తోమతలేని పేదింటి అడపడుచుల పెళ్ళిళ్ళకు కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్దిక సహాయం అందిస్తుందన్నారు.ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మరిన్ని కళ్యాణలక్ష్మీ,షాదిముబారక్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### విభిన్న వంటపాత్రల సమ్మేళనం

విభిన్నరుచులు సువాసనల సమ్మేళనం తెలంగాణ వంట కాలువిభిన్నమైన పదార్థాలకు మించి సాంప్రదాయ పాత్రల రహస్య ప్రపంచమూ ఇక్కడ ఉంది. ఈ మహోన్నతమైన రుచుల రూపకల్పనలో ప్రతి ఒక్కటీ కీలకపాత్ర పోషిస్తాయి. గోల్డ్ డ్రాప్ గైడ్‌తో తెలంగాణ మహోన్నత వారసత్వాన్ని పరిశోధిద్దాం. ఇందులో రాతి చిప్ప, ఉరులి, మురుక్కు అచ్చు, అటుకుల్, మత్తి పత్ర, దిమ్యాజిక్ ఆఫ్ కాస్ట్ ఐరన్, రాతి చిప్ప పాత్రను కల్‌చట్టి అనికూడా పిలుస్తారు. తెలంగాణ వంటశాలలో అసలైన మల్టీటాస్కర్ ఇది.

# కార్మికులకు అండగా సీఐటీయూ

## సిఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**షాబాద్, మే 30, ప్రభాతవార్త :** కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తూ అండగా నిలిచిన సంఘం సీఐటీయూ అని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాని ని పురస్కరించుకుని షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో జెండాను ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఐటీయూ ఏర్పడి నేటికి 54సంవత్సరాలు పూర్తి చేసుకుందని, అప్పటి నుండి కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి అనేక పోరాటు చేసిందన్నారు. అలాగే కక్కులూర్, కేసారం గ్రామాల్లో నూతన సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ కార్మికుల సంక్షేమం కోసం పాలకవర్గాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై అనేక పోరాటు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సత్తయ్య, నరసింహ, మల్లయ్య, కవిత, సుజాత, నరసింహ, రమేష్, రాంచంద్రయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

**యాచారంలో.. యాచారం మే30,ప్రభాతవార్త :** సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాచారం మండలం మాల్ మార్కెట్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్ర మాన్ని సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..... సిఐటియు కార్మిక సంఘం ఆవిర్భవించి నేటితో 54 సంవత్సరాలు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు.వివిధ విభాగాల సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాలు పూర్తిస్థాయిలో



నాగర్‌కుంట గ్రామంలో జెండాను ఎగరవేస్తున్న దృశ్యం



యాచారంలో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అమలు కాకపోవడం వలన కాంట్రాక్టు కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. కార్మిక చట్టాలు,కనీస సౌక ర్యాలు ఏవిధంగా అమలు అవుతున్నాయో పూర్తిస్థాయిలో కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు తెలుసుకొని వాటిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు యాచారం మండల కన్వీనర్ చందు నాయక్, కార్మికులు సోమయ్య,సత్యనారాయణ, రాములు, లింగమ్మ, నర్సమ్మ,సుగుణ, మంజుల, యాదమ్మ, వెంకటేష్, యాదయ్య, చంద్రయ్య,రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులకు వెళ్లి వృద్ధుడు మృతి

**చౌడపూర్ మే30,ప్రభాతవార్త :** చౌడపూర్ మండల పరిధిలోని బంగ్రంపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన వృద్ధుడు బిచ్చపు చంద్రయ్య గుండెపోటుతో మరణించాడు.వివరాల్లోకి వెళ్లితే అదే గ్రామానికి చెందిన బిచ్చపు చంద్రయ్య రోజువారి మాదిరిగా ఉపాధి హామీ పనులు చేపట్టి తిరిగి వస్తుండగా చాతి నొప్పితో బాధపడుతూ గుండెపోటుతో అక్కడికక్కడే మరణించాడు.ఉపాధి హామీ పనుల అనంతరం చంద్రయ్య మరణించాడని ప్రభుత్వం తరపున చంద్రయ్య కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదరినశ రేణుక తెలిపారు.

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

**షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి**

**షాబాద్, మే 30, ప్రభాతవార్త :** పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా టీకాలు వేయించాలని షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ, కుమ్మరిగూడ గ్రామాల్లో గురువా రం జీవాలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... తొలకరి వర్షాలకు వచ్చే జీవాలకు వచ్చే చిటిక వ్యాధి, గొంతువాపు వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. తమ జీవాలకు, పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని జీవాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి ఎంపీడీవో రాములు

**బంట్వారం, మే30, (ప్రభాతవార్త):** జూన్ 3 నుండి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని ప్రకడ్బందిగా నిర్వహించాలని ఎంపీడీవో రాములు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆయా పాఠశాలల కొనసాగుతున్న 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల పన ుల ను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తవుతుందని, త్వరలో పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. దీంతో విధ్యార్థులకు మౌళిక సదుపామాలు కల్పించాలన్నారు. ఇదే సందర్భంగా ఎంఈవో చంద్రప్ప మాట్లాడుతూ.. ప నులు తొందరగా వేగవంతంగా జరుపుకోవాలని, పెయింటింగ్ వేయించుకోవాలని తెలియజేశారు. అంగన్వాడి పిల్లల్ని మండల పరిషత్ పాఠశాలలో చేర్పించాలని, అదే విదంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విజయ్ కుమార్, ఎంఏవో సంధ్య, ఏపీఎం దేవయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రధానోపాధ్యాయులు అంగన్వాడి ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మ న్లు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

**పెద్దేముల్, మే 30, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాకర్లు సీజ్ చేసిన సంఘటన పెద్దేముల్ పోలీ స్స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందినగిడ్డ అనిల్, గోపాల్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్లు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రుక్మాపూర్ గ్రామ శివారు లో పోలీసులు పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లకు సంబంధించిన డ్రైవర్లు, ఓనర్లు అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడి దొంగతనంగా రవాణ చేస్తున్నం దునవారిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పెద్దేముల్ ఎస్ఐ గిరి హెచ్చరించారు.

## ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం

**హాజరైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను, జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి,మే30,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం కేంద్రంలో నూతనంగా నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు నేటితో ముగిశాయి. తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారం యజ్ఞ యాగాలతో పెద్దఎత్తున గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఇతిహాస రామయణ మహాభారతం కథలతో భక్తులతో దేవాలయంలో కోలాహాలంగా ఉత్సవాలు నిర్వహించారు. గురువారం లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవం గా దేవాలయ ప్రాంగణంలో కళ్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి జెడ్పిటీసీ దేవాలయట్రస్ట్ ఉప్పల వెంకటేష్ దంపతులతోపాటు కుటుంబ సభ్యులందరూ హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కళ్యాణోత్సవానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బిఆర్ ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు నాయకులను దేవాలయ ప్రాంగణంలో వెంకటేష్ వారిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ కళ్యాణోత్సవంలో తలకొండపల్లి ఎంపిపి తిరుమని నిర్మల శ్రీశైలంగౌడ్ దంపతులు స్థానిక మాజీ సర్పంచ్ లతితజ్యోతయ్య దంపతులు తదితరులు కూర్చున్నారు. ఈకార్యక్రమానికి సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాజీ జెడ్పిటిసి పద్మనరసింహ తహసీల్దార్ రంగారెడ్డి డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ నాయకులు ఈశ్వర్ నరసింహ మల్లేష్ యాదయ్యతోపాటు ఆయా గ్రామాల భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యక్తులు రిమాండ్

**మాడ్గుల,మే30,ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలోని బ్రాహ్మపల్లిలో ప్రభుత్వ అనుమతి పొందని నకిలీ పత్తి విత్తనాలను ఇండ్లలో నిల్వ చేసిన ముగ్గురిని శుక్రవారం రిమాండ్‌కు తరిలించినట్లు మాడ్గుల సిఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.వ్యవసాయ అధికారికి బ్రాహ్మణపల్లిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ నిషేధించిన బిటి పత్తి వితాలను ఇంట్లో అక్రమంగా నిలువ చేసి అమాయకులేన రైతులకు అమ్ముతున్నారని ఫిర్యాదు రావడంతో తనికీలు నిర్వహించారు.దీంతో నిషేదిత పత్తి విత్తనా లను స్వాదినం చేసుకుని గ్రామానికి చెందిన దూగ్గింపుడి మాౕరెడ్డి, అల్లం మాౕరెడ్డి,అల్లం వినోద్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.మరి కొంత మంది పరారిలో ఉన్నట్లు,వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వారిని త్వరలోనే పట్టుకుని చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

## బావిలో వ్యక్తి మృతదేహం లభ్యం .!

**తాండూరు, మే 30, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో బావిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరులో గురువారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబందించిన వివరాలు.. పాత తాండూరులోని నిజాం షాహి దర్గా సమీపంలో ఉన్న బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే తాండూరు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది సహాకారంతో మృతదేహాన్ని బావిలో నుండి బయటకు తీశారు. మృతుని వద్ద వివరాలను పరిశీలించారు. మృతుని ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో కుటుంబసభ్యులు గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన జెట్టిపాగ వెంకటేష్‌గా తెలిసింది. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెళ్లడించారు.

### ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



**గజ్వేల్, మే 30 (ప్రభాతవార్త):** కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం సెంటర్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. సిఐటియు ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, రవి, రంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, స్వామి, నర్సింలు, బాబు తదితరులు ఉన్నారు.

### విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి : ఏవో

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 30, ప్రభాతవార్త :** చెరువులోని నల్లమట్టితో రైతులకు అనేక లాభాలున్నాయని, విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. గురువారం కాట్రియాల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వచ్చే వర్షాకాలం కోసం ఈ వేసవికాలంలో చేపట్టవలసిన ముఖ్యమైన కార్యక్రమంలో మొదటిది చెరువు నల్లమట్టిని పొలాల్లోకి తోలుకోవడమని తెలిపారు. అదేవిధంగా నేలలో భౌతిక, రసాయన మార్పుల వల్ల ఉదజని సూచికను స్థిరంగా ఉంచడం ద్వారా పంటలలో గణనీయమైన దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అదే విదంగా విత్తన కొనుగోలులో తీసుకోవాల్సి న జాగ్రత్తలు, వేసవి కాలంలో చేయదగినటువంటి వ్యవసాయ పనులు వచ్చే వర్షాకాలంలో సాగుచేసే పంటలలో చీడపీడల నివారణ, విత్తనాల కొనుగోలులో పాటించవలసిన జాగ్రత్తలు మరియు మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## సురేశ్‌షెట్కార్ గెలుపు ఖాయం

**-టిపిసిసి సభ్యుడు శంకరయ్యస్వామి**

**నాగల్‌గిద్ద, మే 30, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ లక్ష మెజార్టీతో పార్లమెంట్ మెట్లు ఎక్కడం ఖాయమని టిపిసిసిసభ్యులు, మాజీ ఎంపిపి అధ్యక్షులు శంకరయ్యస్వామి అన్నారు. గురువారం శంకరయ్యస్వామి మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : సిఐ

**రామాయంపేట, మే 30, ప్రభాతవార్త :** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేష్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం రామాయంపేట సర్కిల్ ఆఫీస్‌లో సీఐ ఆధ్వ ర్యంలో మండలంలో ఉన్న సీడ్స్ వ్యాపారస్తులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ విత్తన చట్టం 1983లోబడి అందరూ విత్తన వ్యాపారం చేయాలని, ప్రతి విత్తన డీలరు లైసెన్సు కలిగి ఉండాలని, అదేవిధంగా లైసెన్స్ గడువు తేదీని సరిచూసుకోవాలని, అధికృత విత్తన కంపెనీల విత్తనాలు తేవాలని, విత్తనాలు తెచ్చేటప్పుడు ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికేట్ ఉండాలని, ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని, ప్రతి బిల్లుపై రైతు సంతకాలను తీసుకోవాలని, పోలీసు, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు సహకరించి రికార్డులను చూపించాలని డీలర్లకు సూచించారు. ఎవ్వరూ కూడా నకిలీ విత్తనాలు అమ్మకూడదని, అందరూ నిబంధనల ప్రకారం వ్యాపారం చేయాలని, రైతులు సీడ్స్ కొన్నప్పుడు షాప్ వారు కచ్చితంగా రశీదు ఇవ్వాలని సూచించారు.స్థానిక ఎస్ఐ రంజిత్‌కుమార్, స్థానిక వ్యవసాయ శాఖ ఎ.ఓ రాజ్‌నారాయణ పాల్గొన్నారు.

### రత్నాపూర్‌లో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**నర్సాపూర్ మే, 30. ప్రభాతవార్త :** శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ గ్రామ శివారులో ఒక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్ల గ్రామస్తులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత రాత్రి ఇంటినుండి వెళ్లిన కుమ్మరి నారాయణ గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



యాచారం బస్సుస్టాండ్‌లో ప్రయాణికులు

## యాచారంలో బస్టాండ్‌లో దేవరకొండ ఎక్స్‌ప్రెస్ బస్సును నిలుపాలి

**యాచారం మే30,ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలోని బస్సు స్టాండ్‌లో దేవరకొండ ఆర్టిసి బస్సులను నిలుపాలని నిర్లక్ష్యం చేయరాదని ప్రయాణీకులు కోరుతున్నారు.దేవరకొండ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణీకులకు అసౌకర్యంగా ఆపకపోవడం లాంటి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దేవరకొండ ఎక్స్ ప్రెస్‌లో కండక్టర్ల తీరు బాగాలేదని ఆలోచనతో ప్రయాణీకులను చులకన చూస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత



అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న దృశ్యం

**ఆదిభట్ల మే30,ప్రభాతవార్త :** అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న పది టిప్పర్లను స్వాధీనం చేసుకొన్న ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది.ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డి వివరాల ప్రకారం...ఆదిభట్ల పరిధిలోని కొంగరకలాన్ రావిరాల మంగళపల్లి గ్రామాలలో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని పక్కా సమాచారంతో గత కొన్ని రోజులుగా అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రదేశాలలో దాడులు నిర్వహించారు.సోమవారం మట్టి తరలిస్తున్న 5 టిప్పర్లను స్వాధీనం చేసుకొని మహేశ్వరం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. మరల మంగళవారం కొంగరకలా గ్రామంలో మరో ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.ఇకపై అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే సహించేది లేదని పేర్కొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి



పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులను పరిశీలిస్తున్న డీఈఓ సుశీంద్రరావు

**ఆదిభట్ల మే30,ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన పనులు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని డిఈఓ సుశీంద్ర రావు ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.గురువారం యాచారం మండలంలోని ఎంపియుపిఎస్ గడ్డ మల్లయ్య గూడ,ఎంపిపిఎస్ మాల్ మార్కెట్ పాఠశాలలను డిఈవో సుశీంద్ర రావు సందర్శించారు.ఆయా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.పని నిర్వహణలో ఎక్కడ కూడా అలసత్వానికి తావివ్వకుండా ,నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గడ్డ మల్లయ్య గూడ ప్రధానోపాధాయులు డాక్టర్ జగన్నాథ్,మాల్ మార్కెట్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత పాల్గొన్నారు.

### వాహనదారులకు పోలీస్‌ల అవగాహన : సిఐ శ్రీధర్‌రెడ్డి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్,మే30,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంలో కొడంగల్ సిఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్ఐ రహూఫ్ అధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నియామలపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు.నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు వెంకటే చాలనలు వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో 15 వాహనాలకు నంబర్ ప్లేట్‌లులేని వాహనాలను గుర్తించడం జరిగిందని,ప్రతి ఒక్కరుకూడా రోడ్డు భద్రత నియామాలను పాటించాలని వారు సూచించారు.మైనర్‌లకు వాహనాలను ఇవ్వరాదని ఇస్తే అలాంటి వాహన యాజమానులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ఏఎస్ఐ,శ్రీనివాస్‌గౌడ్,కన్నయ్య,వాహనదారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణకు కఠిన చర్యలు

**రాచకొండ సిపి తరుణ్‌జోషి**

**ఘట్‌కేసర్, మే 30, ప్రభాతవార్త:** నిషేధిత మత్తుపదార్థాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమీషనర్ తరుణ్‌జోషి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డ్రగ్స్ కట్టడి, నూతన నేర న్యాయ చట్టాలు, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీ, ఇతర అధికారులతో సీపీ ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలను అరికట్టేందుకు రాచకొండ కమీషనరేట్ పరిదిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందా లను ఏరా ్పటు చేసు ్తన్నామని, నూతన నేర న్యాయ చట్టాలపై పోలీసు సిబ్బందికి సంపూర్ణ పరిజ్ఞానం కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీపీ తెలిపారు. నిషేధిత మత్తుపదార్థాల వాడకం సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాలను అణచి వేయాలని, నిందితులపై పీడీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సీపీ ఆదేశించారు. డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని, మత్తుపదార్థాల బారిన పడిన యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, యువత శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తుపదా ర్థాలు విచ్చిన్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డిపిఎస్ చట్టం అమలుతీరు పట్ల దర్యాప్తు అధికారులు పూర్తి అవగాహన కల్గి ఉండాలని, నూతన నేరన్యాయ చట్టాల ప్రకారం దర్యాప్తు విధా నాలను పాటించాలని డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఎన్‌డిపిఎస్ చట్టం-1985 ప్రకారం కేసులు నమోదు చేసి నేరస్తులకు గరిష్ట శిక్ష పడేలా చేయాలనా ్నరు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయచట్టాలు-2023 అమలులోకి రానున్న నేపథ్యంలో పలు కేసుల్లో దర్యాప్తు, విచారణలో పాటించవలసిన నూతన విధానాలపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్గిఉండాలని సూచించారు. 'భారతీయ న్యాయ సంహిత, భార తీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినాయం' ప్రకారం కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులను అలవరచుకోవాలని ఆదేశం చారు. నకిలీ విత ్తనాలను విక్రయించే వారిపై పీడీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు, నాసిరకం పురుగుల మందు లను ముందుగా గుర్తించడం, కట్టడి చేయడం, సరఫరా చేసే వారి సమాచారం సేకరించడంపై దృష్టి పెట్టాలని, ఫర్టిలైజర్ దుకాణాలపై ఆకస్మిక దాడులుచేసి తనిఖీ చేయాలని నాసిరకం విత్తనాలు అమ్మేవారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయా లని సీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో యాదాద్రి డీసీపీ రాజేశ్ చంద్ర, ఎల్‌బినగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎస్‌బీ డీసీపీ కరుణాకర్, అడ్మిన్ డీసీపీ ఇందిర, క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు, సైబర్ క్రైమ్ డీసీపీ చంద్ర మోహన్, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చౌటకూరు, మే 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట శివారులోగల సిబిఎల్ పరిశ్రమలో గురువారం సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యూనియన్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలో జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నా రావు, నాయకులు నాగభూషణం, సత్యనారాయణ, శ్రీనివాస్, బి విఠల్, లక్ష్మారెడ్డి, కే సురేష్, ఎం శ్రీనివాస్, మైపాల్, నరేష్ పాల్గొన్నారు.

## వైభవంగా బోరంచ పోతమ్మ జాతర ఉత్సవాలు



బోరంచ పోచమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**మనూర్, మే 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచలో నల్లపోచమ్మ తల్లి ఏడు వారాల జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 3వ వారం అయిన గురువారం భక్తులు అమ్మవారి దర్శనానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి బాధ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

## నిందితులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేస్తున్న నేతలు

**జహీరాబాద్, మే 30, ప్రభాతవార్త:** కోహీర్ మండలం బడంపేట్ గ్రామంలో ఈ నెల 18న బేగరి నర్సింలును విచక్షణా రహితంగా కొట్టి చంపిన 9 మంది అగ్రకులస్థులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సమతా సైనిక్‌దళ్, బుద్దిస్టు సొసైటీ నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సింలు హత్యకు కారకులైన 9 మందిపై పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేస్తే పోలీసులు కేవలం ముగ్గురిపై మాత్రమే కేసు నమోదు చేశారని, మిగతా 6 మందిపై ఎలాంటి కేసులు లేకుండా పోయాయని విచారం వ్యక్తంచేశారు. మిగిలిన ఆరుగురిపైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు నర్సింలు కుటుంబ సభ్యులకు హామి ఇచ్చినా అలా జరగలేదని మండి పడ్డారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేస్‌కుమార్‌తో హత్య విషయమై ఫోన్‌లో చర్చించి నిందితులందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించినట్లు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, జిల్లా అధ్యక్షులు కర్దం రవికుమార్, బిఆర్ఎస్ నాయకులు బండి మోహన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మోహన్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు విక్కీ, బుద్దిష్ట నాయకులు గోపాల్, సాయి పాల్గొన్నారు.

## విజయం మనదే: బిబి పటేల్



మాట్లాడుతున్న బిబిపటేల్

**కల్హేర్, మే 30 ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బిజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించనున్నట్లు ఆ పార్టీ అభ్యర్థి బీబీ పటేల్ దీమా వ్యక్తం చేశారు. గురువారం మాసాన్‌పల్లి కూడలిలోగల వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ వారిగా ఎన్నికలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, నాయకులు, తన విజయం కోసం ఎంతో కృషి చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ టికెట్ కేటాయించినందుకు మోదీ, అమిత్‌షా, నడ్డాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ పెద్దోల గంగారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్‌గౌడ్, కోకన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఎం.విజయపాల్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, అసెంబ్లీ కన్వీనరన రజనీకాంత్, మండల అధ్యక్షులు యెన్నం అనిల్‌రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదవి ఉద్యోగాలు అందిపుచ్చుకోండి

**ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్ టౌన్, మే 30, ప్రభాతవార్త:** క్రమ శిక్షణతో విద్యను అందుకుని పోటీ పరీక్షల్లో ఉత్తములుగా నిలిచి ఉద్యోగాలు అందుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లోని గ్రంథాలయానికి సర్వోదయ గ్రామసేవ అభియాన్ సంస్థ పోటీ పరీక్షలకు సబంధించిన పలు పుస్తకాలను వితరణ చేయగా ఎమ్మెల్యే యువతీ యువకులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి అభ్యర్థులు పోటీ పరీక్షల పుస్తకాలను కొనే పరిస్థితి లేకపోవడాన్ని గుర్తించి సంస్థ గ్రంథాలయానికి పుస్తకాలను అందిచేయడం అభినందనీయమన్నారు. తన సూచనల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ గ్రంథాలయానికి వైఫై సదుపాయం కల్పించడంతో పాటు కంప్యూటర్ అందిండం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ దారం శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అవుటి శంకర ముదిరాజ్, కిషన్ నాయక్‌రాథోడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నాం



యువతీ యువకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలును పూర్తిచేస్తాం

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



వెల్మకన్నెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కౌడిపల్లి, మే 30, ప్రభాతవార్త:** మిగిలిన ఉన్న 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాబోయే నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ హామి ఇచ్చారు. గురువారం మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వాతావరణ సమతుల్యతతో కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా నడుస్తూ ముగింపు దశకు వచ్చిందన్నారు. రైతులు నుండి కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే ఎగుమతి చేయించి, సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడు కంటె ఈ ఏడు 70 వేల క్వింటాళ్లు అదనంగా కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన అన్నారు. నేటివరకు 300 కేంద్రాలను మూసివేయగా, ఇంకా 100 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నడుస్తుందని రాబోవు నాలుగు రోజుల్లో కొనగోలు పూర్తి చేసుకొని ఆ కేంద్రాలు కూడ ముగుఇంపు దశకు చేరుకుంటాయని ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు, రైతులు ఏవరు భయాందోళనకు గురి కావద్దని ఆయన తెలిపారు. రైతుల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యంలో మంచి నాణ్యత గల బియ్యాన్ని వేరే జిల్లాలకు పంపిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదాం

**డిసిసి ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్**



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**సిద్దిపేట రూరల్, మే 30, ప్రభాతవార్త:** పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని డీసీసీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా విభాగం మండల అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు అందేలా పని చేద్దామన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికి లేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు ఎస్సీ సెల్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేదల సంక్షానికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చూసి ఓర్వలేక బిఆర్ఎస్, బిజెపి నాయకులు అర్థం, పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని వారి విమర్శలు, ఆరోపణలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కష్ట కాలంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిసుందన్నారు. అనంతరం డీసీసీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు విజయ్‌కుమార్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో చిన్నకోదూరు పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, రూరల్ మండల అధ్యక్షులు గరిపల్లి రాములుయాదవ్, ఉపాధ్యక్షులు సందబోయిన పర్శరాం, నాయకులు కొమ్ము ప్రశాంత్, రాజేందర్, రమేష్, నరహరి, మల్లేశం, కనకయ్య, ఏసు, బాలయ్య, రాజేష్, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రమేష్, శివకుమార్, కనకయ్య, మనోజ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆంజనేయస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

**న్యాల్‌కల్, మే 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని న్యామతాబాద్ గ్రామంలో ఈ నెల 31వ తేదీనుంచి జూన్ 2వ తేదీవరకు శ్రీకాశీ విశ్వనాథ దత్తాత్రేయ నవగ్రహ నాగదేవత ఆంజనేయస్వామి ఆలయాల ద్వితీయ వార్షికోత్సవాలను నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు శ్రీవిశ్వానందగిరి మహారాజ్ ఆశ్రమం పీఠాదిపతి తలిపారు. ఈ నెల 31న ఉదయం 7 గంటలకు గౌరీ గణపతి స్వస్తి పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, గోపూజ, రుత్విక్ వరణం, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, సాయంత్రం 6 గంటలకు పునః గౌరీ పూజ, గణపతి పూజ, నవగ్రహ అష్టదిక్పాల, ఏకలింగంతో మండల సర్వతోభద్ర, మండల ఆరాధన అగ్ని ప్రతిష్ట, అవాహిక మంటప దేవత హవనము, మహ మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాద కార్యక్రమాలు ఉంటాయన్నారు. జూన్ 1న ఉదయం 7 గంటలకు మండప దేవత ఆరాధన, కాశీ విశ్వనాథుడికి రుద్రాభిషేకం, నవగ్రహ దేవతాపూజ, నాగదేవత గురుపాదుక స్వామి వారి అభిషేకార్చన, శ్రీ రుద్ర హోమం, మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. జూన్ 2న కాశీ విశ్వనాథుడికి మహారుద్రాభిషేకం, సకల దేవతా హవనం, జయాది హోమం, మహ పూర్ణాహుతి, విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథుడి కళ్యాణోత్సవం, మంగళ హారతి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3 రోజులు ప్రతినిత్యం సాయంత్రం న్యామతాబాద్, శబరిమాత, నాగన్‌పల్లి, మామిడ్గి భజన మండళ్ల వారిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 2న మధ్యాహ్నం బీదర్‌కు చెందిన శివకుమార్ పంచాల్‌చే సంగీత దర్బార్, ధార్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



తునికి గ్రామంలోని అమ్మపాఠశాలను పరిశీలిస్తున్న రాహుల్ రాజ్

## ప్రైవేట్ బడులకు ధీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కౌడిపల్లి, మే 30, ప్రభాతవార్త:** ప్రైవేట్ బడులకు ధీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకుగాను ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తునికి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించారు. అమ్మఆదర్శ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు అనుకూలంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బడులు ఆధునికతతోపాటు ఆహ్లాదకరంగా తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇట్టి పనులను గ్రామ సమాఖ్యలతో ఆయా పాఠశాలల్లో మరమ్మత్తు పనులు వచ్చే నెల 5వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అందుకు గాను పనులు చేపట్టిన వారికి ముందస్తుగా 25 శాతం నిధులు మంజూరు చేశామని ఆయన అన్నారు. చేపట్టిన పనులకు నిధులు సరిపోకుంటే ప్రతిపాదనలు పంపాలని, అదనపు నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామి ఇచ్చారు. పాఠశాలలు పున: ప్రారంభంకు ముందు పూర్తిస్థాయిలో పనులు యుద్ద ప్రాతిపతికన పూర్తి చేయాలని ఆయన విఓలకు ఆదేశాలు జారీ చేశారు. మరమ్మత్తు పనులను వేగం పెంచి నాణ్యత ప్రమాణాలు పాటించి తత్రతగతిన పనులు పూర్తి అయ్యేలా పంచాయతీ రాజ ఇంజనీరింగ అధికారులు చొరవ చూపాలని ఆయన అన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని అందుకు కారకులైన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## సమస్యలను కలెక్టర్‌కు వివరించిన కాంగ్రెస్ నేతలు

**సిద్దిపేట రూరల్, మే 30, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణ మున్సిపల్ పరిధిలోని వివిధ సమస్యలతోపాటు కొనాకార్పస్ చెట్ల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సాకి అనంద్, ముత్యాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ రియాజ్ గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొనాకార్పస్ చెట్ల వలన వేర్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి వెళ్లడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైపలైన్ ధ్వంసం అవుతుందని చెట్ల కొమ్మల్లు విద్యుత్ వైర్లకు తాకడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరూ స్థానిక ప్రతిపక్ష నాయకులు కరెంటు విషయంలో దొంగనాటలు అడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు.ఎన్నికల కోడ్ ముగియగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ మను చౌదరి హామీ ఇచ్చినట్లు సాకి అనంద్, బుచ్చిరెడ్డి, రియాజ్‌లు తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలింగించే చర్యలు తీసుకొని నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపినట్లు వారు వివరించారు.

## ఎమ్మెల్యేకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

**నాగల్‌గిద్ద, మే 30, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి త్వరలో విస్తరించబోయే కేబినెట్‌లో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు గుండేరావు పాటిల్, అనిల్ పాటిల్ అధిష్టానానికి వినతి చేశారు. గురువారం వారు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఒక మారు కూడా మంత్రి వర్గంలో చోటు దక్కలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, నారాయణఖేడ్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నందున వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని నాయకులు గుండేరావు పాటిల్, అనిల్‌పాటిల్‌లు వనతి చేశారు.

# బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**



మాట్లాడుతున్న మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను అదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో బడిబాట నిర్వహణపై అధికారులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. బడిఈడు పిల్లలను తప్పకుండా బడిలో చేర్పించలన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు గ్రామాలు, పట్టణాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యాశాఖ అధికారులు, ఉధ్యాయులు మాత్రమేకాకుండా ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఇంటింటికి వెళ్లి డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బడుల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించాలన్నారు. విద్యార్థులు లేక మూతపడిన ప్రభుత్వ పాఠశాలలో కూడా మళ్లి విద్యార్థులు వచ్చేలా తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. అసలే పాఠశాలకు వెళ్లని విద్యార్థులపై ప్రధానంగా ఫోకస్‌పెట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వసతి గృహాలలో కూడా ఉచిత భోజనం, వసతి పొంది చదువుకునే విధానంపై బడిబాట కార్యక్రమంలో వివరించాలన్నారు. కార్యక్రమంలో డిఈవో శ్రీనివాస్, జిల్లా ఎస్సీ అభివృద్దిశాఖ అధికారి కవిత, బీసీ అభివృద్దిశాఖ అధికారి సరోజ, డిఆర్‌డివో జయదేవ్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, డిఎంఅండ్‌హెచ్ఓ పుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లాపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## సైబర్ నేరాలపై అవగాహన

**మనూర్, మే 30, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్ఐ అంబ్రెయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని బెల్లాపూర్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంబ్రెయ్య మాట్లాడుతూ ప్రజలు ఆన్‌లైన్‌లో అనవసరమైన చాటింగ్‌లు చేయవద్దని, యాప్ రుణాలపై జాగ్రత్తగా ఉండాలని, భూసమస్యలపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అనుమతి పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

**మనూర్, మే 30, ప్రభాతవార్త:** పంటల అధిక దిగుబడి సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు నాటుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు రైతులు ప్రభుత్వంచే అనుమతి పొందిన డీలర్ వద్ద విత్తనాలు కొనాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నూతన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురవారం మండల పరిధిలోని ఎన్‌జి హుక్రానాలో వ్యవసాయ అధికారులు రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ నూతన్ ప్రసాద్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ రైతులు లూజ్‌గా ఉంటే విత్తనాలు కొనవద్దని, డీలర్ వద్ద విత్తనాలు కొన్నప్పుడు రశీదులను పొందాలని, పంట దిగుబడి అయ్యే వరకు రశీదును రైతులు తమ వద్ద అంటిపెట్టుకోవాలని సూచించారు. ఎంఆర్‌పి రేటుకు మించి నగదును అందచేయవద్దన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సింహారెడ్డి, మారుతి, హైమద్ తదితరులు ఉన్నారు.

## ఖేడ్ ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

**నారాయణఖేడ్, మే 30 ప్రభాతవార్త:** టిఎస్ఆర్‌టిసి ఎండి సజ్జనార్ ఆదేశాల మేరకు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలోని సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం ఆధ్వర్యంలో డిపోలోని ఉద్యోగులకు డాక్టరు రాజేశ్వర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 21, 22, 23 తేదిల్లో 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ రిపోర్టు ఆధారంగా అవసరమైన వారు మందులు వాడుకోవాలని ఆర్టీసీ ఉద్యోగులకు సూచించారు.కార్యక్రమంలో ఎం.టీ. నర్సింలు, ఎస్‌టీఐ నందులాల్, లిడింగ్ హ్యాండ్ అజీమ్, నెహ్రు, మార్కెటింగ్ సెల్ ఆఫీసర్ పాండు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు. డాక్టరు రాజేశ్వర్‌కు డిపో ఆర్టీసీ ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

## విత్తనాలు కొనుగోలుపై అవగాహన

**ఝరసంగం, మే 30, ప్రభాతవార్త:** పంటల దిగుబడి ఆశాజనంగా వచ్చేందుకు నాణ్యమైన విత్తనాలు అందుకునేందుకు రైతుల జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం అన్నారు. గురువారం మండల పరిధిలోని కమాల్‌పల్లి, గినియార్‌పల్లి, సంగం(కె), చిల్కేపల్లి, జునేగావ్ గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారి అవగాహన కల్పించారు. లూజుగా ఉన్న విత్తనాల బస్తాలను తీసుకోవద్దన, ప్రభుత్వంచే అనుమతి పొందిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, పంట దిగుబడి వచ్చే వరకు రైతులు రశీదును తమ వద్ద అంటిపెట్టుకోవాలని సూచించారు. సందర్భంగా విత్తన దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఆర్‌పికి కంటే అధిక ధరలకు విత్తనాలు అమ్మవద్దన్నారు. దుకాణంలో స్టాక్ వివరాలను ఎప్పటికి అప్పుడు నమోదు చేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సుకుమార్, హరికృష్ణ, జ్ఞానం, రేణుక, భారతి, రైతులు దానప్ప, కర్ణాకర్, అంజయ్య, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలిని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**తొగుట, మే 30, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు వెంకటరావుపేట గ్రామానికి చెందిన బెజ్జనమైన ప్రవీణ్ తల్లి లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న అయన గురువారం బాధితురాలిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలు లక్ష్మీకి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అయన వెంట పార్టీ నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి, తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఉల్లెంగుల సాయికుమార్, సొలిపేట ప్రసాద్‌రెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

## బాధితుడికి ఆపన్నహస్త మిత్ర బృందం చేయూత

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఆర్థికంగా భరోసా కల్పిస్తున్న ఆపన్నహస్త మిత్ర బృందం గజ్వేల్ వారు తమ 90వ ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని గురువారం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో చేపట్టింది. ఈ సందర్భంగా ఆపన్నహస్త మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం మాట్లాడుతూ గిరిపల్లి గ్రామానికి చెందిన ఎంకమొల్ల ప్రణీత్(9) అనే బాలుగు బహుళ అవయవ వైఫల్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నట్లు తెలిపారు. ఈ మధ్య కిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ నడుస్తుండగా, ఆపరేషన్ కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దాతల సహాయం కోరుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు స్పందించిన తాము బాలుని కుటుంబాన్ని కలిసి వారికి రూ.20వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్ర బృందం ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్, ఉపాధ్యక్షుడు మంగలి సాయి, సహాయ కార్యదర్శి కొలిచెలిమె స్వామి, సభ్యులు సత్యనారాయణ, అనిల్, గౌతంకృష్ణ, గణేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగడిపేట హనుమాన్ దేవాలయంలో జయంతి

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయంలో జూన్ 1వ తేదీ శనివారం జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి విఠాల మురళీమోహన్‌శర్మ తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు గణపతి పూజ, స్వస్తి వాచనం, పుణ్యవాచనం, 7 గంటలకు శతమాన్యుసూక్త అభిషేకం, చందనాలంకరణ, 8 గంటలకు లక్ష తమలపాకులతో అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## నీట మునిగి యువకుడి మృతి

**పాపన్నపేట, మే 30, ప్రభాతవార్త:** ప్రమాదావశాత్తూ నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నరేష్ కథన ప్రకారం... పెద్దశంకరంపేట మండలం బుర్జాన్‌పల్లికి చెందిన దోవూరి కిరణ్‌కుమార్(22) మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు.బుధవారం స్నేహితులతో కలిసి ఏడుపాయలకు చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుని సాయంత్రం ఆలయ సమీపంలో ఉన్న వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లి ఈత కొడుతూ ప్రమాదావశాస్తు కిరణ్‌కుమార్ నీట మునిగిపోయాడన్నారు. స్నేహితులు స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రాత్రికి ప్రాజెక్టులో కిరణ్ కుమార్ శవాన్ని గుర్తించి వెలకి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

**జహీరాబాద్, మే 30, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన బేగరి నర్సింలు హత్య కేసులో గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్, పట్లోళ్ల సందీప్, పట్లోళ్ల రాహుల్‌లను బుధవారం కోహీర్ చౌరస్తాలో అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి కె.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన బడంపేటకు చెందిన కొంత మంది నర్సింలుపై దాడిచేసి తీవ్రంగా కొట్టడంతో హైదరాబాద్ అసుపత్రిలో చికిత్స అందుకుంటూ నర్సింలు ఈనెల 27న మృతి చెందినట్లు డిఎస్‌పి వివరించారు.